క్లుప్తంగా

చిన్న గంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న గంగమ్మ తల్లి

వీరబల్లి: మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలోని గుర్రప్పగారిపల్లి వద్ద వెలసిన చిన్న గంగమ్మకు శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గంగమ్మతల్లిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులు తీర్చుకుని చల్లగా చూడమ్మా అని వేడుకున్నారు. భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రబృందం

రైల్వేకోడూరు అర్బన్ : చిన్ననాటి నుంచి ఆడిపాడి, చదువుకున్న స్నేహితుడి అనారోగ్యంతో బాధపడుతుంటే ఆ మిత్ర బృందం జీర్ణించుకోలేకపోయింది. ఆ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలని భావించారు. అందరూ కలిసి ఆర్థికంగా సాయం చేసి ఆదుకున్నారు. రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ జోనల్ అధ్యక్షుడు మల్లెం హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్న బాలగౌరీ మురళీ యాదవ్ తోటి స్నేహితుల సహకారంతో రూ. 50 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. కోడూరు విజయ హాస్పిటల్ వద్ద ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న బాలగౌరీ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరశురాం, కిషోర్, విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

నందలూరు : మండలంలోని చింతకాయలపల్లి గ్రామానికి చెందిన గంజికుంట వెంకటసుబ్బయ్య మనమడి వివాహ వేడుకలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నల్లతిమ్మయ్యగారిపల్లి సర్పంచ్ గీతాల నరసింహారెడ్డి, గుండు మల్లిఖార్జునరెడ్డి, భాస్కర్‌యాదవ్, గంగినాయుడు, శంకర్, వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికులకు జేజేలు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నందలూరు : ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సైనికులకు మద్దతుగా జేజేలు పలుకుతూ, వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ శనివారం సాయంత్రం అరవపల్లి కృష్ణ మందిరం దగ్గర నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు మన జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రారంభం కాగానే పోలీసులు అడ్డుకున్నారు. ఈ ర్యాలీ శాంతియుతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలపడంతో పోలీసులు అనుమతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాజంపేట అసెంబ్లీ కో కన్వీనర్ డాక్టర్ అరిగే రాంప్రసాద్, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, వైసీపీ నాయకులు బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కాకి చంద్ర, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష దైవం.. అమ్మ



చెట్టుకు నీళ్లు పోస్తున్న సీడీపీఓ తదితరులు

లక్కిరెడ్డిపల్లి : తల్లిని మించిన దైవం లేదని, నవ మాసాలు మోసి, ప్రాణాన్ని పణంగా జన్మనిచ్చే తల్లి ప్రత్యక్ష దైవం అని సీడీపీఓ వై. పద్మావతి అన్నారు. లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు, లక్కిరెడ్డిపల్లి మండలం, కోణంపేట సెక్టార్ పరిధిలోని పందిళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ ఆధ్వర్యంలో మదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ప్రతి బిడ్డకు అమ్మ మొదటి దైవం, గురువు, మొదటి స్నేహితురాలుగా పరిచయమై ప్రతి తల్లీ తన బిడ్డ బంగారు భవిష్యత్తుకోసం అహర్నిశలు తపిస్తూ, శ్రమిస్తూ ఎల్లవేళలా బిడ్డ మంచిని కోరుకునే అమ్మ రుణం తీర్చుకోలేమని పేర్కొన్నారు. తల్లిపేరుతో అంగన్‌వాడీ ప్రాంగణంలో చెట్టు నాటారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎం లక్ష్మీదేవి, అంగన్ వాడీ వర్కర్స్ సరస్వతి, నాగసుబ్బమ్మ పాల్గొన్నారు.

మామిడి నేలబడి



మండీల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మామిడి కాయలు

- నష్టాలలో కూరుకుపోయిన మామిడి రైతు
- పూత దశ నుంచీ కష్టాలే
- ఈదురుగాలులకు నేలరాలిన కాయలు
- దళారుల చేతుల్లో నష్టపోతున్న రైతులు

వీరబల్లి: వీరబల్లి అంటేనే ఎవరికైనా గుర్తు వచ్చేది బేనీషా మామిడి పండ్లు. రుచికరమైన బేనీషా పండ్లు ఇక్కడ సొంతం. తీపు, రుచి ఎక్కువగా ఉండడంతో ఈ పండ్లకు భలే డిమాండ్. అయితే ఈ ఏడాది నవంబరులో రావాల్సిన పూత జనవరిలో రావడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో రైతులు అప్పులపాలయ్యారు. ఇక్కడి రైతులు ఎక్కువగా మామిడి తోటలపై ఆసక్తి చూపుతారు. మామిడి తోట పూతదశ నుంచి కాయలు వచ్చే వరకు ఆరు నెలల సమయం పడుతుంది. కాగా ఈ ఏడాది సరైన సమయానికి వర్షాలు కురవలేదు. దీంతో పంట దిగుబడి తగ్గింది. ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. అంతో ఇంతో వచ్చిన కాపు, అకాల వర్షాలకు ఈదురు గాలులకు కాయలు రాలిపోయాయి. ఉన్న కాయలను కోసుకొని వ్యాపారస్తులు దగ్గరకు వెళితే గిట్టుబాటు ధర లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆందోళనలో అన్నదాత

పంట చేతికి అందివచ్చే వేళ.. అకాల వర్షాలు, ఈదురుగాలులతో తీవ్రంగా నష్టపోయామని అన్నదాతలు వాపోతున్నారు. మామిడి పూత దశలో పొగమంచు, దోమపోటు బెడద వెంటాడింది. మందులు పిచికారీ చేయడంతో కొంత మేర పంటను నిలబెట్టుకున్నారు. ఈదురుగాలుల ప్రభావంతో చాలాచోట్ల కాయలు రాలిపోయాయి. దీంతో తమకు ఈ ఏడాదీ నష్టాలు తప్పేలా లేవని రైతులు వాపోతున్నారు. వీరబల్లి బేనీషాకు రాష్ట్రంలోనే కాక జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతూ పండ్ల రకంలో రారాజుగా నిలుస్తోంది. ఈ ఏడాది విదేశాలకు ఎగుమతి చేయడానికి నాణ్యత కలిగిన పండ్లు రాలేదని కొందరు రైతులు చెబుతున్నారు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో బేనీషా దిగుబడి సక్రమంగా రాలేదని చెబుతున్నారు. కనీసం మామిడి తోటలకు పెట్టిన ఖర్చులు కూడా రాలేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది పూర్తిగా నష్టపోయాం



దిగుబడి లేక, ఉన్న దిగుబడికి ధరలేక తీవ్రంగా నష్టపోయాం. అకాల వర్షాలకు, ఈదురు గాలులకు కాయలు రాలిపోయాయి. ఈ ఏడాది మామిడి రైతులు మండలంలో పూర్తిగా నష్టపోయారు. దళారులను ఆశ్రయించడంతో రైతులు మోసపోతున్నారు. ప్రభుత్వమే ఒక గిట్టుబాటు ధర నిర్ణయించినట్లయితే కొద్దిమేర భారం తగ్గే అవకాశం ఉంది.

– వీర నాగిరెడ్డి, బాలసానివాండ్లపల్లి, వీరబల్లి మండలం


ప్రభుత్వం ఆదుకోవాలి



మండలంలోని మామిడి రైతులు పూర్తిగా నష్టపోయారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గింది. నవంబర్‌లో రావాల్సిన పూత జనవరిలో రావడం.. పైగా అకాల వర్షాలు, ఈదురుగాలులకు కాయలు రాలిపోయాయి. అప్పుల బాధలతో రైతులు ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు.

– రాజశేఖర్ రాజు, ఫార్మర్స్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, వీరబల్లి మండలం

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



మర్రిచెట్టు లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలో వెలసిన మర్రిచెట్టు లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. దాతలు మార్ల రవీంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ మదన్ మోహన్, వీరబల్లి లక్ష్మీరాజు, సురేంద్రరాజు, కెఎస్ఆర్ పల్లి మాజీ సర్పంచ్ దేవేంద్రరెడ్డి, చెరువు ముందురపల్లికి చెందిన చెన్న కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, బొజ్జ యోగీశ్వర్‌రెడ్డి, ముప్పాల నరసింహరాజు, కదిరి నాగేంద్రబాబు, దండే వెంకటరమణ సహకారంతో స్వామి వారి కల్యాణ్యాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవంలో ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రసాద్ యాదవ్, రామచంద్ర యాదవ్, శివ శంకర్ రెడ్డి, బాల సుబ్రమణ్యం, గంగరాజు, దండే వీరయ్య, మధు, శివయ్య, గంగరాజు, రవీంద్ర, వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి, గంగయ్య, భువనేశ్వర్ రెడ్డి, హెచ్ శ్రీనివాసులు, సభాపతి నాయుడు, నాగేంద్ర, రమణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

12న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పుల్లంపేట: మండల పరిధిలోని ఎగువరెడ్డిపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం సోమవారం నిర్వహించనున్నట్లు కంచెర్ల చెంగయ్య నాయుడు తెలిపారు. రాత్రికి కొండేటి రమణయ్య, సతీమణి కొండేటి భారతమ్మల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా జయంత్యుత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి

వీరబల్లి: మండలంలోని పెదివీడు పంచాయతీలోని మాండవ్య నదిగుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం, విష్ణుహోమం నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు భక్త ప్రహ్లాద కళాబృందం వారితో నాటక పదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ప్రజలు, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్త కోరారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

రాజంపేట రూరల్ : ఉమ్మడి జిల్లాలలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న భువనగిరిపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు దేవస్థాన కమిటి నిర్వాహకులు శనివారం శ్రీకారం చుట్టారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వేకువ జామున నుంచి స్వామి వారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి దేవస్థాన ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని కొండపై నుంచి భువనగిరిపల్లిలో ఊరేగించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

పెనగలూరు: పెనగలూరు మండలం, ఈటమాపురం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు వైస్ చైర్మన్ బత్తిన గుండాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ, 6 గంటలకు అభిషేకం జరుగుతుందని, సాయంత్రం ఏడు గంటలకు బత్తిన గుండాల్ రెడ్డి సతీమణి మహేశ్వరీలు స్వామివారికి పట్టు వస్త్రాలు, బంగారు మాంగల్యాలు, వెండి వస్తువులు ఆలయ మర్యాదలతో స్వామివారికి 8 గంటలకు నాయుడువారిపల్లి, తూర్పుపల్లి, చెంచువారు చెంచు లక్ష్మీకి సాంగెము తీసుకురావడం ఆనవాయితీ. ఏడు గంటల నుంచి ఈటమాపురం, రాజుపాలెంకు చెందిన క్షత్రియులు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. 12వ తేదిన ఈటమాపురంలో లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం, 13న నాయుడువారిపల్లిలో బ్రహ్మోత్సవం, 14న తూర్పుపల్లిలో బ్రహ్మోత్సవం, 16న రథోత్సవం, 17న పుష్పయాగం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

14న గంగాభవానీ అమ్మవారి తిరునాల



విశేష అలంకారంలో అమ్మవారు

గాలివీడు : మండలంలోని అరవీడు గ్రామం రెడ్డివారిపల్లె, కసిరెడ్డిగారిపల్లె సమీపంలో పవిత్ర కుషావతీ నదీతీరాన వెలసిన శ్రీ దొనకొండ గంగాభవానీ అమ్మవారి తిరునాల ఈ నెల 14,15 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 వ తేదీ బుధవారం కూర్మయగారి పల్లె నుంచి వీరతాళ్ల పెట్టెలతో పూజారులు, భక్తులు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని సిద్దల కూడు నైవేద్యంతో తిరునాల మహోత్సవానికి అంకురార్పణ చేస్తారు. 15వ తేదీ గురువారం ఉదయం మహిళలు అమ్మవారికి బోనాల సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

భక్తి శ్రద్ధలతో శనేశ్వరస్వామికి పూజలు



శనేశ్వరస్వామికి పూజలు చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకుడు మేడా మధుసూదన్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ మందగిరి శనేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి గణపతిపూజ, కలశ స్థాపన, పుణ్యాహావాచనం, క్షీరాభిషేకం, తైలాభిషేకం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి స్వామి వారికి తైలాభిషేకం పూజలు నిర్వహించారన్నారు. వైఎస్ఆర్‌సీపీ నాయకుడు మేడా మధుసూదన్‌రెడ్డి శనేశ్వర స్వామిని దర్శించుకొని తైలాభిషేకం పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కలిశ స్థాపన పూజలు

మండలంలోని జీఎంజీ కళాశాలకు ఎదురుగా వెలసిన పెంచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం కలిశ స్థాపన పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహావాచనం, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ నరసింహ జపం, దీక్షా హోమం, అభిషేకం, తీర్థ ప్రసాదాలు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, దీక్షా హోమం, నవగ్రామ జపం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తి శ్రద్ధలతో శని త్రయోదశి వేడుకలు

రాజంపేట రూరల్ : నవగ్రహాలలో శక్తి వంతమైన శశనేశ్వరస్వామికి శనివారం శని త్రయోదశి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల శివారు నెల్లూరు రహదారిలోని పోలి చెరువు కట్ట వద్ద ఉన్న శనేశ్వర స్వామి దేవస్థానంలో దేవస్థాన ప్రధాన అర్చకులు అప్పజోడు విజయకుమార్‌శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శనిత్రయోదశిని పురస్కరించుకొని వేకువ జామున 5.30 గంటలకు స్వామి వారికి పంచామృతాభిషేకంను అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 5గంటల నుంచి మహన్యాస రుద్రాభిషేకం, నవగ్రహ హోమం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగం వృథా కాదు



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ జయచంద్ర

సుండుపల్లె : యుద్ధ భూమిలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ త్యాగం వృథా కాదని చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ జయచంద్ర అన్నారు. శనివారం జవాన్ మురళీనాయక్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా కాశ్మీర్ యుద్ధభూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళీనాయక్ వీరమరణం పొందడం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం గడ్డంతాండ పంచాయతీ కల్లితాండా గ్రామానికి చెందిన మురళీనాయక్ చూపిన ధైర్య సాహసాలు రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. లగిశెట్టి బాబు, బస్సా వెంకటరమణ, వడతల జగన్మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్, విశ్వనాథ్, వెంకటేష్, నేతి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటాడుకుందాం.. ఎంజాయ్ చేద్దాం



ఈత కొడుతున్న చిన్నారులు



చిన్నారులు రూపొందించిన చాందినీ బండి

రాయచోటి టౌన్ : వేసవి సెలవులు అంటే విద్యార్థులకు ఎంతో సంతోషం. సెలవులు అనగానే ఎంతో ఆనందపడతారు. అమ్మమ్మ ఊరికి... నాన్నమ్మ.. స్నేహితుల ఊర్లకు.. సినిమాలకు షికార్లకు వెళ్లొచ్చని సంతోషంగా సంబరంగా ఉంటుంటారు. అయితే కొందరు పిల్లలు తమ ఇళ్ల వద్దనే తక మెదళ్లలోని జి/జ్ఞానకు పదును పెడుతున్నారు. తమలోని కళను వెలికి తీసే ప్రయత్నం చేస్తుంటారు. తమకు ఇష్టమైన ఈత నేర్చుకోవడం. చిన్న తనంలో ఆడుకున్న ఆటలను మళ్లీ ఆడుకొంటూ సరదాలు తీర్చుకొంటారు. ఇక పల్లెటూళ్లలో అయితే గోళీ ఆటలు, కర్రా బిళ్ల, కోతికొమ్మ, ఇలా అనేక రకాలు ఆడుకొంటారు.

అయితే నేటి తరం పిల్లలు ప్రయోగాలు చేస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు. గ్రామాలలో చాందినీ బండ్లు కట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకొనే ఆనవాయితీ నేటికీ ఉంది. వాటిని చూసి వాటిని పోలిన విధంగా చాందినీ బండ్లు తయారు చేసి వాటికి రంగుల పేపర్లు అతికించి అందంగా అలంకరించి, బ్యాటరీల సాయంతో విద్యుత్ లైట్లు అమర్చారు. చాందినీ బండ్లను ఊరేగిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి

రాయచోటి టౌన్ : ఊళ్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని అర్బన్ సీఐ వెంకటా చలపతి తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటి పట్టణంలో తాళాలు వేసిన ఇంటిని తమ సిబ్బంది ద్వారా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఊళ్లకు వెళ్లే వారు ఇంట్లో విలువైన బంగారు ఆభరణలు ఉంచొద్దని, గేటుకు లోపలనుంచి తాళం వేయాలని, ఇంటి ముందు గదిలో లైట్ వేసి ఉంచాలని, ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలను అమర్చాలని తెలిపారు. ఊరికి వెళ్తే తప్పకుండా ఇంటికి తాళం వేసి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ

సిద్దవటం : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, విజయవాడ సంచాలకులు వారి ఆదేశాల మేరకు కడప బీసీ స్టడీ సర్కిల్‌లో మెగా డీఎస్సీ పరీక్ష కొరకు ఆన్‌లైన్ ద్వారా త్వరలో ఉచిత శిక్షణ ఇస్తామని సిద్దవటం బీసీ వెల్ఫేర్ హెచ్‌డబ్ల్యూఓ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన సిద్దవటంలో మాట్లాడుతూ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు (టెట్) పరీక్షలో అర్హత సాధించిన వారికి వైఎస్ఆర్ జిల్లా వాసులకు మాత్రమే బి.సి. ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ), ఎస్సీ, ఎస్టీ కేటగిరిలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులకు ఎస్.జి.టి, స్కూల్ అసిస్టెంటు పరీక్షల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తు చేయువారు టీచర్ ఎలిజిబిలిటి టెస్టు పరీక్షలో అర్హత సాధించిన మార్కుల లిస్టు, నేటీవీటి, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, 2 ఫాస్ పోర్టుసైజు ఫొటోలు జతపరచి ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్, కడప లోని ఓల్డ్ రిమ్స్ బీసీ భవన్ రెండవ అంతస్తులోని కార్యాలయంలో ధరఖాస్తులను అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9849919221, 9966418572 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ధర్నాకు అనుమతివ్వండి



అర్బన్ సీఐ వెంకట చలపతికి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి డీఈవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేసేందుకు అనుమతి ఇవ్వాలని రాయచోటి అర్బన్ సీఐ వెంకట చలపతిని యూటీఎఫ్ నాయకులు కోరారు. శనివారం సీఐని కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ మాట్లాడుతూ విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై రోజుకొక నిబంధనతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం వారిలో ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ప్రధానంగా పాఠశాల పునర్వ్యవస్థీకరణ సమస్య, బదిలీలు, సమస్యలు పరిష్కరించాలని కోరారు. తమస సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నమండెం యూటీఎఫ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, వీరబల్లె మండల అధ్యక్షుడు నాగార్జున పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదు

రాయచోటి టౌన్ : హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి ద్విచక్రవాహనదారులను హెచ్చరించారు. శనివారం జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి పట్టణం శివార్లు, రింగ్ రోడ్డు సర్కిల్ వద్ద హెల్మెట్ అవశ్యకతను తెలిపేవిధంగా పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. హెల్మెట్ లేకపోతే ఎలాంటి ఇబ్బందులు కలుగుతాయి, ప్రమాదాలు జరిగితే ప్రాణాలను ఎలా కాపాడుకోవచ్చునే విషయాలపై స్థానికంగా వెళ్లుతున్న ద్విచక్రవాహన దారులకు వివరించారు. అలాగే హెల్మెట్ లేకుండా వెళ్లే వారికి రూ.1010 జరిమానా కూడా విధించారు.

భాకరాపేటలో నాకాబందీ

సిద్దవటం : మండలంలోని భాకరాపేటలో శనివారం ఉదయం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు భాకరాపేటలో నాకాబందీ నిర్వహించామని తెలిపారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల గృహాలు, వాహనాలు తనిఖీ చేశామన్నారు. సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, చోరీల నియంత్రణపై జాగ్రతలు తీసుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఊళ్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ, ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణానికి చెందిన బీసీ నాయకుడు పామూరు ధనుంజయ కుమార్తె పామూరు భాను (18) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి శనివారం దనుంజయ నివాసానికి వెళ్లి భాను మృతదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆర్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో వర్షం

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణంలో శనివారం రాత్రి అకస్మాత్తుగా వర్షం కురిసింది. సాయంత్రం నుంచి చల్లబడిన వాతావరణం రాత్రికి ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. అలాగే అకస్మాత్తుగా కురిసిన వర్షంతో పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు, పనులు ముగించుకొని రాత్రికి ఇంటికి వెళుతున్న వారు ఇబ్బందులకు గురయ్యారు. రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ప్రవహించింది.